


సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
19వ వసంతంలోకి ...

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 30 అక్టోబర్ 2025 పేజీలు 8


# నష్టపోయిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం




- 90కి.మీల వేగంతో వీచిన గాలులతో విద్యుత్ అంతరాయం కలిగింది
- 24 గంటల్లోనే విద్యుత్ వ్యవస్థను పురుద్ధరించడం అభినందనీయం
- వేట నిషేధం కారణంగా నష్టపోయిన మత్స్యకారులకు 50 కేజీల బియ్యం
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితుల్ని చక్కదిద్దిన మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మెంథా తుపానుతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర భరోసా ఇచ్చారు. తెల్లవారు జాము నుంచే తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితుల్ని చక్కదిద్దారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి విద్యుత్ లైన్ల మరమ్మతులను పరిశీలించారు. సర్కారువారి తోట ప్రాంతంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించారు. మేకవారిపాలెంలో చెట్టు విరిగి ఇంటిపై పడడంతో గాయాలపాలై కొల్లు వీరబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి నష్టపరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు. మచిలీపట్నం ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన తుపాను పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, అక్కడి ప్రజలకు అందిస్తున్న భోజన సదుపాయాల గురించి అడిగి **మిగతా 2లో...**



## యంత్రాంగాన్ని సీఎం సమాయత్తం చేసిన తీరు అద్భుతం

- ఆయన ముందస్తు చర్యల వల్లే ముప్పు నివారించగలిగాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు
- తుపాను సహాయక చర్యలపై మంత్రి సత్య కుమార్ యాదవ్

వివరాలు 2లో...




### నష్టాల సత్వర అంచనాలకు

## డ్రోన్ సాంకేతికత

- మండలానికో ప్రత్యేక డ్రోన్ సర్వే బృందం
- తక్కువ సమయంలోనే కచ్చితమైన, పారదర్శక నివేదికల రూపకల్పనకు వీలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** జిల్లాలోని మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంటలతో పాటు రహదారులు, వంతెనలు, ఇళ్లు తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించి జరిగిన నష్టాన్ని వేగవంతంగా, కచ్చితంగా, అత్యంత పారదర్శకంగా అంచనా వేసేందుకు డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ కేంద్రం (సీసీసీ)లో కలెక్టర్ లక్ష్మీశ.. తుపాను నష్టాలను ప్రాథమికంగా అంచనా వేసేందుకు డ్రోన్ కార్పొరేషన్ ద్వారా తొలిగా అందుబాటులోకి వచ్చిన డ్రోన్ల పనితీరును పరిశీలించారు. **మిగతా 2లో...**



# విస్తృతంగా కృష్ణా కలెక్టర్ పర్యటన

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** జిల్లాలో మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో 208 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 16,500 మంది బాధిత ప్రజలను తరలించి వారికి అన్ని వసతులు కల్పించామని జిల్లా కలెక్టర్ డి.కే.బాలాజీ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ తో కలసి అవనిగడ్డ నియోజకవర్గంలోని మండల కేంద్రమైన కోడూరుతో పాటు స్వతంత్రపురం గ్రామంలో పర్యటించారు. తొలుత అవనిగడ్డ నుండి కోడూరుకు వెళ్లే మార్గంలో పడిపోయిన చెట్లను తొలగించే కార్యక్రమాన్ని, విద్యుత్తు సౌకర్యం పునరుద్ధరించే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. అవనిగడ్డ మండలంలో ఈరోజు ఉదయం 7 గంటలకు విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించామని కోడూరు మండలంలో మందపాక రామకృష్ణాపురం గణపేశ్వరం ఏటి మొగ్గ గ్రామాలకు విధి సౌకర్యం కల్పించాల్సి ఉందని **మిగతా 2లో...**

# అల్యూమినియం ఉత్పత్తిలో ఏఐ-ఆధారిత మెషిన్ హియరింగ్, విజన్ టెక్నాలజీలను పరిచయం చేసిన రుసల్

**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రపంచంలోని అతిపెద్ద అల్యూమినియం ఉత్పత్తి దారులలో ఒకటైన రుసల్, దాని ఉత్పత్తి ప్రక్రియలలో సామర్థ్యాన్ని పెంచడం, ఉత్పత్తి నాణ్యతను మెరుగుపరచడం వంటి రెండు ముఖ్యమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీలను ప్రవేశపెట్టింది. ప్రపంచ కార్యకలాపాలతో రష్యా ప్రధాన కార్యాలయం కలిగిన ఈ కంపెనీ వరుసగా అల్యూమినా ఉత్పత్తి, అల్యూమినియం మెల్ట్ తయారీని మెరుగుపరచడానికి మెషిన్ హియరింగ్, మెషిన్ విజన్ టెక్నాలజీలను అమలు చేసింది. మిల్లు కార్యకలాపాల నుండి వచ్చే శబ్ద కంపనాలను విశ్లేషించడానికి గణిత అల్గారిథమ్‌లను ఉపయోగించే మెషిన్ హియరింగ్ టెక్నాలజీని కంపెనీ అమలు చేసింది, బాక్సైట్ ధాతువు లోడింగ్ యొక్క ఆప్టిమైజేషన్‌ను అనుమతిస్తుంది, పరికరాల దుస్తులు ధరిస్తుంది, శక్తి వినియోగాన్ని తగ్గిస్తుంది. అసంబద్ధమైన శబ్దాన్ని విస్మరిస్తూ ధ్వని నమూనాలు, మిల్లు లోడింగ్ మధ్య ఖచ్చితమైన సంబంధాన్ని గుర్తించడానికి అల్గోరిథం శిక్షణ పొందింది. శక్తి సామర్థ్యం, గ్రైండింగ్ నాణ్యత, పరికరాల భద్రతకు సరైన మిల్లు లోడింగ్‌ను నిర్వహించడం చాలా ముఖ్యం. మిల్లులో అండర్‌లోడ్ చేయడం వల్ల విద్యుత్ వృధా అవుతుంది, గ్రైండింగ్ బంతులు ధాతువుకు బదులుగా మిల్లు లైనింగ్‌ను తాకుతాయి, ఫలితంగా దుస్తులు ధరిస్తాయి. మరోవైపు, ఓవర్‌లోడింగ్ ముతక, తక్కువ-నాణ్యత గల గ్రైండింగ్‌ను ఉత్పత్తి చేస్తుంది, ఇది తదుపరి లీచింగ్ ప్రక్రియ యొక్క సామర్థ్యాన్ని తగ్గిస్తుంది, అల్యూమినా దిగుబడిని తగ్గిస్తుంది. దీర్ఘకాలిక ఓవర్‌లోడ్ మిల్లు మరమ్మతుల ఫ్రీక్వెన్సీని కూడా పెంచుతుంది.

మిశ్రమ లోహ ఉత్పత్తిలో, 20 వరుస కార్యకలాపాలను కలిగి ఉన్న అల్యూమినియం మెల్ట్ తయారీ యొక్క సంక్లిష్ట ప్రక్రియను పర్యవేక్షించడానికి రుసాల్ ఏఐని వర్తింపజేస్తోంది. యంత్ర దృష్టిని ఉపయోగించి కరిగే తయారీని పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన న్యూరల్ నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న వ్యవస్థను రుసాల్ అభివృద్ధి చేసింది. ఈ సాంకేతికత ఆపరేటర్‌కు అవసరమైన మిశ్రమ రసాయన శాస్త్రాన్ని సాధించడానికి, తక్కువ-నాణ్యత గల లోహాన్ని ఉత్పత్తి చేసే ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. "యంత్ర దృష్టిని ఉపయోగించి పనిచేసే ఈ వ్యవస్థ, మానవ తప్పిదాల ప్రభావాన్ని తగ్గిస్తుంది ఎందుకంటే ఇది మిశ్రమ లోహ తయారీ సమయంలో కీలకమైన క్షణాలను కోల్పోకుండా ఆపరేటర్‌కు సహాయపడుతుంది, దాని శుభ్రపరిచే సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి వేడి కరిగే ఉపరితలంపై చెత్త ప్రాంతాలను బాగా గుర్తిస్తుంది." అని రుసాల్ ఇంజనీరింగ్, టెక్నాలజీ సెంటర్‌లోని ప్రొడక్షన్ ఆటోమేషన్ డైరెక్టర్ మిఖాయిల్ గ్రినిషిన్ అన్నారు.

# శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి దేవస్థాన శిఖర ప్రతిష్ఠా సంప్రోక్షణ మహోత్సవం





**అక్టోబరు 30 గురువారం నుండి నవంబరు 01 శనివారం వరకు**

**దేవస్థానం అభివృద్ధి కమిటీ, భక్తబృందం ఆధ్వర్యంలో**

**గుడ్లవల్లేరు అక్టోబరు 29 మేజర్ న్యూస్:** రాష్ట్రంలో రెండవ అన్నవరంగా ప్రసిద్ధిచెందిన కృష్ణా జిల్లా, గుడ్లవల్లేరు గ్రామంలోని శ్రీ రమా సహిత సత్య నారాయణ స్వామి వారి దేవస్థానము జీర్ణోద్ధరణ పూర్వక శిఖర ప్రతిష్ఠా సంప్రోక్షణ మహోత్సవం అక్టోబరు 30 గురువారం నుండి నవంబరు 01 వ తేదీ శనివారం వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. కార్యక్రమముల వివరములు ప్రకటిస్తూ ది. 30-10-2025 సాయంత్రం గం. 6-31 ని.లకు గోపూజ, ప్రార్ధనా సూక్త పఠనము, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన్న పంచగవ్యారాధన, ప్రాశన, రక్షా బంధన, దీక్షా స్వీకరణ, మృత్సంగ్రహణ, వాస్తుపూజ, వాస్తు హోమము, అంకురారోపణ, కుంభపూజ, నీరాజన తీర్ధ ప్రసాద వినియోగములుబీ ది. 31-10-2025 ఉదయం గం. 8-01 ని.లకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, పంచగవ్యారాధన, ప్రాశన, అగ్నిమంధన, సర్వేషు కుండేషు, అగ్ని ప్రతిష్ఠాపన, శిఖర, అక్షిన్మోచన, అంగ హోమము, మూలమంత్ర హవనములు, స్వామి వారికి - శిఖర - యంత్రములకు చతుర్దశ కలశ స్నపన, పంచగవ్య, క్షీర అధివాసములు, శిఖర - యంత్రములకు జలాధివాసము, అధివాసాంగ హోమములు, నవగ్రహ ఆరాధన, నీరాజన తీర్ధ ప్రసాద వినియోగం. సాయంత్రం గం. 5-00 లకు ఆలయ ప్రభూతబలి, గ్రామోత్సవం, గం. 6-30 ని. లకు అగ్ని ఆరాధన, ఉక్త హోమములు, కుంభపూజ, సర్వ దేవార్చన, మహాశాంతి హోమం, శిఖర - యంత్రములకు ధాన్యాధివాసం, పంచతల్పాధి వాసం, శయనాధివాసం, నీరాజన తీర్ధప్రసాద వినియోగంబీ ది.01-11-2025 ఉదయం గం. 8-01 ని.లకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, అగ్ని ధ్యానము, హోమములు, మహా పూర్ణాహుతి, రత్నన్యాస, ధాతున్యాస, యంత్ర స్థాపనలు సుముహూర్తమునకు శిఖర ప్రతిష్టా మహోత్సవము కళాన్యాసము, కూష్మాండబలి, ధ్యాన, ధేను దర్శనము, శాంతికళ్యాణము, మహదాశీర్వచనం, నీరాజన తీర్ధ ప్రసాద వినియోగములు జరుపుతామని తెలిపారు. అలాగే 01.12.2025 ఉదయం గం౦ఎ 10-56 ని.లకు శతభిషా నక్షత్రమందు గుడ్లవల్లేరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి సంప్రోక్షణ మహోత్సవములు యాజ్ఞీక నిర్వహణ ముత్తేవి శ్రీనివాస శశికాంత్, ప్రధాన అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు జరిపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమములకు భక్త మహాశయులు అందరూ విచ్చేసి కార్యక్రమములను తిలకించి సత్యనారాయణ స్వామి వారిని దర్శించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అభివృద్ధి కమిటి, భక్త బృందం, గుడ్లవల్లేరు ఆహ్వానిస్తోంది.

# గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన టీడీపీ నేతలు




**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడ్ల వల్లేరు మండల టిడిపి అధ్యక్షులు కోసరాజు బాపయ్య చౌదరి (చిట్టి బాబు), కొడాలి రామరాజు, మండలంలోని టీడీపీ నాయకులు గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రావి వెంకటేశ్వరరావు మండలంలోని అధికారులతో సమావేశమై తుఫాను ప్రభావం గురించి సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలో ఉన్న పరిస్థితులను తెలుసుకుని, తక్షణం అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ అంతరాయం ఉన్న గ్రామాలలో వెంటనే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ జి. రమేష్, మండల అభివృద్ధి అధికారి ఎం.డి. ఇమ్రాన్, తహసీల్దార్ బి. లోకరాజు, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.ఎస్.ఎస్. అంజనా దేవి, వ్యవసాయ అధికారి, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమావేశం అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహసీల్దార్, ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి మండలంలోని పునరావాస కేంద్రాలను సందర్శించి, అక్కడ శానిటేషన్, భోజన వసతులు, ఇతర అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం మండలంలోని అన్ని గ్రామాల పరిస్థితులను అడిగి తెలుసుకుంటూ, అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతున్నదని ఎంపిడిఓ ఇమ్రాన్ పేర్కొన్నారు.



# లెవెన్ కేవీ విద్యుత్ లైన్లకు మరమ్మతులు

**గుడ్లవల్లేరు అక్టోబరు 29 మేజర్ న్యూస్:** మొంథా తుపానుకు మరమ్మతులకు గురైన లెవెన్ కేవీ విద్యుత్ లైన్లతో పాటు గుడ్లవల్లేరు పంచాయితి వద్ద ట్రాన్స్‌ఫారమ్‌పై చెట్టు పడితే సిబ్బంది రిపేర్లు చేశారు. గుడ్లవల్లేరు మెయిన్ సెంటర్‌లో విద్యుత్ లైన్లతో పాటు స్తంభాలను విద్యుత్ సిబ్బంది ఏర్పాటు చేశారు. దీనితో 5 గంటల పాటు విద్యుత్ సరఫరాకు స్థానికంగా అనుకోని అవరోధం ఏర్పడింది. తుపానుకు ఎలాంటి అవరోధం లేకుండా ఎప్పటికపుడు విద్యుత్‌ను అందించేందుకు మరమ్మతులను త్వరిగతిన చేయిస్తున్నట్లు ఈఈ జి.బి.శ్రీనివాసరరావు తెలిపారు.

# ఏపీ మద్యం కేసులో ఏడుగురికి బెయిల్ నిరాకరణ

**బెయిల్ పిటిషన్ల రద్దులో సిద్ధార్థ్ లూథ్రా ప్రస్తావించిన అంశాలు ఇవే..**

**విజయవాడ మేజర్ న్యూస్ :** సీనియర్ అడ్వకేట్ సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించిన సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లో భారీ మద్యం కొనుగోలు అవకతవకల విచారణకు సంబంధించిన కేసులో నిందితులుగా ఉన్న ఏడుగురు వ్యక్తులు దాఖలు చేసిన సాధారణ బెయిల్ పిటిషన్‌లను విజాయవాడలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి తిరస్కరించారు. సీనియర్ అడ్వకేట్ సిద్ధార్థ్ లూథ్రా సమర్పించిన వాదనలను న్యాయస్థానం పూర్తిగా సమర్థించింది. వరుస బెయిల్ పిటిషన్‌లపై అమలయ్యే న్యాయసూత్రాలు, ఆర్థిక నేరాల తీవ్రత, అలాగే చట్టం ప్రకారం దర్యాప్తు కొనసాగించే హక్కు ప్రాసిక్యూషన్‌కు ఉందన్న అంశాలను న్యాయస్థానం ధృవీకరించింది. లూథ్రా సమర్పించిన చట్ట, సాక్ష్య ఆధారాల వాదనలు, ప్రాముఖ్యత కలిగిన కేసులో ప్రాసిక్యూషన్ క్రమపద్ధతి, వాస్తవాల ఆధారంగా సాగిన వాదనను న్యాయస్థానం మన్నించింది. శాస్త్రీయ, వాంగ్మూల ఆధారాలు నేరాల తీవ్రతను ప్రైమా ఫేసీ స్థాయిలో నిర్ధారిస్తున్నాయని కోర్టు పేర్కొంది. ఈ వ్యాఖ్యల ద్వారా కోర్టు లూథ్రా సమర్పించిన వాస్తవ ఆధారాల బలం అంగీకరించి, ప్రాసిక్యూషన్ కేసు యొక్క విశ్వసనీయతను, నిబద్ధతను మరింత బలపరిచింది. తాత్కాలిక వైద్య బెయిల్ కోరిన సందర్భాల్లో, ప్రాసిక్యూషన్ ఇచ్చిన వైద్య సంరక్షణ హామీలను పరిశీలించిన న్యాయస్థానం, నిందితుల ఆరోగ్యంలో ప్రాణాపాయం కలిగించే పరిస్థితి ఏదీ లేదని నిర్ధారించింది. ఈ తీర్పులు లూథ్రా వాదించినట్లుగా, నిందితుల హక్కులను కాపాడుతూ, జరుగుతున్న దర్యాప్తు సమగ్రతను రక్షించే సమతుల్య న్యాయవిధానాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

# మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

**తుఫాన్ ప్రభావంపై సమీక్ష**



పెడన మేజర్ న్యూస్ : మొంథా తుఫాన్ నేపథ్యంలో ఏర్పడిన పరిస్థితులను సమీక్షించేందుకు పెడన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షత వహించారు. సమావేశంలో అజెండాలో ఉన్న ఎనిమిది అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా స్థానిక జనసేన కౌన్సిలర్ కొన్ని అంశాలపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేయగా, చైర్‌పర్సన్ మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులను జవాబు ఇవ్వాలని సూచించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, ముంతా తుఫాన్ ప్రభావం మొదలైన మంగళవారం ఉదయం నుంచి అధికారులు నిరంతరం కృషి చేస్తూ, పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శానిటేషన్ పనులను సమర్ధవంతంగా నిర్వహించామని తెలిపారు. అదేవిధంగా, కొంతమంది పారిశుద్ధ్య కార్మికులు వర్షంలో తడవడం వల్ల అనారోగ్యానికి గురైనట్లు పేర్కొన్నారు. పట్టణంలో కూలిన చెట్లను తొలగించి, విద్యుత్ సరఫరా అంతరాయాన్ని త్వరితగతిన పునరుద్ధరించామన్నారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను వెంటనే పరిష్కరించిన సర్పంచ్ సీతయ్య



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య మొంథా తుఫాను వరద సహాయక చర్యలలో భాగంగా మంగళవారం రాత్రి 12 గంటల వరకు పంచాయతీ సిబ్బంది వైద్య అధికారులు, రెవిన్యూ సిబ్బందితో కలిసి సచివాలయంలోనే అందుబాటులో ఉన్నారు. మంగళవారం రాత్రి నుండి అంబాపురం ఒకటో వార్డులో నీరు బారీగా రావటం రోడ్లు జలమయం అవ్వటంతో బుధవారం ఉదయం వార్డులోని ప్రజలు సర్పంచ్ కి చెప్పగానే ప్రతి రోడ్డును పరిశీలించి రోడ్లపై నిలచిన వర్షపు నీటిని,కచ్చా డ్రైన్లను పూడిక తీయించి బుడమేరు కలువలోకి వరద నీటిని తన సొంత జెసిబి సహాయంతో మళ్ళించారు. అంబాపురం తోటముల వంతెన వద్ద ఉన్న పంటపొలాలలో వరద నీరు వస్తుందేమో అని నిరంతరం పర్యవేక్షించి సిబ్బందితో ఎప్పటికప్పుడు వాకబు చేశారు. సమస్యలను వెంటనే ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించిన సర్పంచ్ సీతయ్యకు గ్రామస్థులు, ధన్యవాదాలు తెలిపారు.



# జాతీయ రహదారి ముంపును నివారించండి

### ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు..

**గన్నవరం, అక్టోబర్ 29, మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంతో పాటు, జాతీయ రహదారి కొద్దిపాటి వర్షానికే ముంపు బారిన పడుతున్నాయని తక్షణమే వర్షపు నీరు బయటకు పోయేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ప్రసాదంపాడు గ్రామంలోని తుఫాను ముంపుకు గురైన ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. విమానాశ్రయం నుంచి అమరావతికి గల ప్రధాన రహదారిపై తరచూ వర్షపు నీరు నిలవడం దారుణమనీ సంబంధిత అధికారులు శ్రద్ధ పెట్టి ఈ రహదారి పై వర్షపు నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకుని ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని ఆదేశించారు. ప్రసాదంపాడు గ్రామంలో ముంపుకు కారణమవుతున్న తిప్పగుంట డ్రైన్ పూడిక తీసి సక్రమంగా నీటిపారుదల జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జాతీయ రహదారిపై ఎడమవైపున కచ్చా డ్రైన్ తవ్వి గ్రామంలోనూ, రహదారిపైనా నీరు నిలవకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి బాబురావు, విజయవాడ రూరల్ మండల తెలుగు మహిళ అధ్యక్షులు నెక్కంటి శ్రీదేవి, టిడిపి నాయకులు బొప్పన హరికృష్ణ, సర్నాల బాలాజీ, కొల్లా ఆనంద్, కోనేరు నాని, పోలిశెట్టి రమణ, గూడపాటి



తులసి మోహన్, నభిగాని కొండ, ఉల్లాస శివ, అద్దేపల్లి సాంబు తదితర టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పామర్రులో మొంథా తుఫాన్ ఎఫెక్ట్

### పామర్రు - దిగమర్రు జాతీయ రహదారిపై నేలకూలిన విద్యుత్ స్తంభాలు





**పామర్రు మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా పామర్రు మండలంలో జాతీయ రహదారిపై విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. పామర్రు మండలం గాంధీ ఆశ్రమం నుండి పామర్రు వైపు జాతీయ రహదారిపై 9చోట్ల విద్యుత్ స్తంభాలు కూలి రహదారిపై పట్టణంతో పడటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రహదారిపైనే స్తంభాలు పడిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్రఇబ్బంది ఏర్పడింది. విద్యుత్ తీగలు రోడ్లపై వేలాడుతుండడంతో వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. తుఫాన్ ప్రభావంతో విద్యుత్ లేక మండలంలోని పలు గ్రామాల ప్రజలు అల్లాడుతున్నారు. కాగా తుఫాన్ ప్రభావంతో పామర్రు సబ్ డివిజన్ పరిధిలో పామర్రు, పమిడిముక్కల,మొవ్వ మండలాల్లో పెద్ద ఎత్తున చెట్లుకూలి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని డీఈఈ సుందర రావు తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో 68 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని అలాగే నాలుగు ట్రాన్స్ఫార్మర్లు కూడా దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు.

అలాగే 33 కెవి విద్యుత్ లైన్ కు సంబంధించి కూడా 20 స్తంభాలు నేలకొరిగినట్లు ఆయన చెప్పారు. వీటి కారణంగా సుమారు 12 లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్లు సుందరరావు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన తమ సిబ్బంది విద్యుత్తు పునరుద్ధరణకు కృషి చేస్తున్నారని తెలిపారు. మండల కేంద్రాలకు ముందుగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని, మిగిలిన గ్రామాలకు కూడా విద్యుత్ అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు.

## వెంట్రప్రగడలో పొలాలను పరిశీలించిన జిల్లా సహాయ కలెక్టర్

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను కారణంగా జరిగిన నష్టం వివరాలను పరిశీలించేందుకు జిల్లా సహాయ కలెక్టర్ ఫర్హీన్ జహీద్ పెదపారుపూడి మండల పరిధిలోని వెంట్రప్రగడ గ్రామంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలోని వరి పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు గుడివాడ ఆర్డిఓ జి. బాలసుబ్రమణ్యం కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంట్రప్రగడ పిఎసిఎస్ అధ్యక్షులు కూచిపూడి వెంకటసుబ్బారావు సహాయ కలెక్టర్ ను కలిసి తుఫాను కారణంగా వరిపైర్లు నేలకొరగడంతో రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, కావున పరిశీలించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ శ్రీను నాయక్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




# కుంటలో బారి గండి

### పంటపొలలోకి చేరిన వరద నీరు

### ఆందోళనలో రైతులు







**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** మండలం పి.నైనవరం గ్రామపంచాయతీ పరిధిలోని కుక్కలవని కుంటలో మొంథా తుఫాన్ ధాటికి బారి గండి పడటంతో పంటపొలలోకి నీరుచేరటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగువున ఉన్న పంటపొల్లలోకి వరదనీరు చెరువునుండి రావటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ త్వరగా పరిష్కారం చూపించమని అదికారులకు విన్నవించుకున్నారు. ఈ విషయం గురించి తెలిసిన వెంటనే ఎన్టీఆర్ జిల్లా సబ్ కలెక్టర్ కావూరి చైతన్య విజయవాడ రూరల్ మండలం ఎమ్మార్వో బి.సుగుణ, ఎంపీడీవో విగ్గిన్స్, నైనవరం పంచాయతీ సర్పంచ్ బట్టా చిన్నబ్బాయి, కార్యదర్శి అజేంద్ర, వీఆర్వో రిజ్వానా బేగం హుటాహుటిన రావటం పరిష్కారం చూపుతామని చెప్పారు. గ్రామంలోని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బెజవాడ రామకృష్ణ, సాతులూరిఅప్పారావు, షేక్ నబీ, రమేష్, దావు హనుమంతరావు ఎర్ర చెరువు భూ ఆక్రమణకు గురైందని చెప్పగా ఆక్రమించిన చెరువు భూములను తొలగించి, రైతుల అందరికి ఉపయోగపడేలా చూడమని చెప్పగా వెంటనే ఆక్రమణలను తొలగించమని ఎమ్మార్వోకి సబ్ కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

## అతలాకుతలంగా విజయవాడ రూరల్ మండలం



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** నున్న గ్రామంలో కళింగ చెరువుకు వరద నీరు బారీగా రావటంతో గండికొట్టి వర్షపు నీరును ఆనుకున్నా పంటపోలాలోకి మళ్ళించడం జరిగింది. అక్కడి సమస్యల గురించి చుట్టుపక్కల ఉన్న రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఎటువంటి సమస్యలు జరగకుండా చూసుకుంటామని ఈ విషయంపై కలెక్టర్ దృష్టి కూడా తీసుకెళ్తామని హామీ



ఇచ్చారు. నున్న పునరావాస కేంద్రంలో ఉన్న వరద బాధితులను, బాలింతలను పరామర్శించి, వారికి అన్ని వసతులు, సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలకియ ఎమ్మార్వో సుగుణ అడిగి తెలుసుకునీ స్వయంగా వరద బాధితులకు భోజనం వడ్డించారు. నున్న గ్రామంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకి సూచించారు. వైద్య అధికారుల అందరూ అందుబాటులో ఉండాలని మందుల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎవరికి సమస్యలు తలెత్తకుండా చూసుకో వాలని డిఎం & హెచ్ఓ సుహాసిని వైద్య అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలకియ,సబ్ కలెక్టర్ కావూరి చైతన్య, మండల ఎమ్మార్వో బి.సుగుణ, ఎంపీడీవో బి.విగ్గిన్స్, మండల, సచివాలయం సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శి సిబ్బంది, ఐసీడీసీ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ జొన్నలగడ్డ కవిత, బి.రాజ్యలక్ష్మి పిహెచ్ఓ సుస్మిత,ఆశ వర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పీఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పూజా



**గన్నవరం (హనుమాన్ జంక్షన్), అక్టోబర్ 29, మేజర్ న్యూస్ :** హనుమాన్ జంక్షన్ శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, పి ఆర్ కే ఫౌండేషన్ చైర్మన్ గన్నవరం పారా రామకృష్ణ అయ్యప్ప స్వామి పీఠం వద్ద పూజా కార్యక్రమం, స్వాములకు బిక్ష నిర్వహించారు. అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమానికి బయలుదేరే ముందు, పారా రామకృష్ణ శ్రీ అభయాంజనేయ స్వామి వారి



దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం బీజేపీ నాయకులు నిడమర్తి నాగేశ్వర రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శేష్ కుమార్, బాపులపాడు తెలుగు దేశం పార్టీ నాయకుడు కొల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## తుఫానుకు రోడ్డుపై పడిన చెట్లను తొలగించిన అధికారులు



**గుడ్లవల్లేరు అక్టోబర్ 29 మేజర్ న్యూస్:** తుఫాను ప్రభావంతో గుడ్లవల్లేరు మండల పరిధిలోని గుడ్లవల్లేరు - ముదినేపల్లి రహదారిపై, ముఖ్యంగా గుడ్లవల్లేరు మండలం చివర విన్నకోట గ్రామం వరకు సుమారు 20 చెట్లు రహదారిపైకి పడిపోయి రాకపోకలకు అంతరాయం కలిగించాయి. ఈ పరిస్థితిని గమనించిన గుడివాడ డివిజన్ ఉపాధ్యక్షుడు, వడ్లమన్నాడు కార్యదర్శి బి. వెంకట రమణ, వడ్లమన్నాడు సచివాలయ కార్యదర్శి, మండల అభివృద్ధి అధికారి ఎం.డి. ఇమ్రాన్ సమన్వయంతో వెంటనే చర్యలు తీసుకుని రహదారిపై పడిన చెట్లను పూర్తిగా తొలగించడమైనది. ప్రస్తుతం రహదారి పూర్తిగా శుభ్రపరచబడినది, వాహన రాకపోకలు సజావుగా కొనసాగుతున్నాయి.



## మైలవరంలో ఎమ్మెల్యే వసంత పర్యటన

### డ్రైనేజీ పూడికతీత పనులు, పునరావాస కేంద్రం పరిశీలన

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బుధవారం పర్యటించారు. నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల్లో ఉదయం నుండే ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పర్యటన ప్రారంభమైంది. ముందుగా కొండపల్లిలో పర్యటన ముగించారు. మైలవరంలో ప్రధాన సెంటర్లో వరదనీరు నిల్వ లేకుండా చేపట్టిన డ్రైనేజీ పూడికతీత పనులు పరిశీలించారు. వరద నీరు ఎగువ నుండి వచ్చే అవకాశాలున్న చోట యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ క్లియరెన్స్ కు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో రహదారులపై వర్షపు నీరు చేరడంతో తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై అధికారులతో చర్చించారు. మైలవరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వారిని పలుకరించారు. అక్కడ వారికి కల్పించిన సౌకర్యాలు పరిశీలించారు. వర్షం తగ్గేవరకూ, తుఫాను ముప్పు పూర్తిగా తొలగిపోయే వరకూ పునరావాస కేంద్రాలలోనే ఉండాలని వారికి సూచించారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు భోజన వసతి సౌకర్యాలు ఏర్పాటు



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** మండలం వేమవరం కుమ్మరిపాలెం కే.తాడేపల్లి గ్రామంలో వరద బాధితులకు సెయింట్ బెనెడిక్ట్స్ హై స్కూల్ నందు బోజన వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయటం జరిగింది. మొత్తం 156 మంది వరద బాధితులు ఉండగా వారికి అన్ని సౌకర్యాలు అందేలా చూడమని ఎవరికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని వారందరికి బరోసా ఇచ్చారు. మీకు తుఫాన్ వల్ల ఎటువంటి సమస్య రాకుండా చూసుకుంటామని అన్నివేళలా ప్రభుత్వం, అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలకియ, ఎమ్మార్వో సుగుణ, ఎంపీడీవో, విగ్గిన్స్ ,గ్రామ పంచాయతీ కార్యదర్శి దుర్గా ప్రసాద్, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పి.నైనవరం టీడీపీ ఆధ్వర్యంలో బాధితులకు భోజనాలు, వసతి ఏర్పాటు



**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గం ప్రభుత్వ విప్ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలనుసారంగా పి.నైనవరం టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో వరద బాధితులకు పునరావాస కేంద్రం లో వైద్య అధికారులు మందులను, వసతి, బోజన సౌకర్యాలను దగ్గరుండి చుసుకోవాల్సిందిగా పార్టీ పెద్దలకు చెప్పగా వచ్చిన 100 మందికి భోజనాలను, వసతి ఏర్పాటు చేశారు. వారికి ఎటువంటి సమస్యలు రాకుండా అన్నివిధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజేంద్ర,విఆర్వో రిజ్వానా బేగం సచివాలయం సిబ్బంది, ఆశా వర్కర్, జనమాల దుర్గమ్మ,జ్యోతి,గ్రామ పార్టీ అధ్యక్షుడు బెజవాడ రామకృష్ణ, షేక్ నబి, మాజీ సర్పంచ్ దావు కోటయ్య,గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు అమ్మిశెట్టి నాగరాజు, లింగం రమేష్,దావు హనుమంతరావు, చప్పిడి రమేష్, కోటేశ్వరరావు, రియాజ్, శివ శంకర్ గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి.



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ప్రకృతి విపత్తు మొంథా తుఫానును సమిష్టి కృషితో సమర్ధవంతంగా ఎదుర్కొన్నామని, దీని ప్రభావంతో నేడు బుధవారం కూడా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ తగు జాగ్రత్తలు పాటించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్టీ కాలనీ, వివిధ ప్రాంతాల్లో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం పర్యటించారు. డ్రైనేజి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని మునిసిపాలిటీ సిబ్బందికి సూచించారు. శాంతినగర్ శివార్లలో బుడమేరు డైవర్షన్ ఛానెల్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఎట్టకేలకు మంగళ వారం అర్ధరాత్రి మొంథా తుఫాన్ తీరం దాటిందన్నారు. ప్రభుత్వ యంత్రాం గం అంతా సమిష్టిగా పని చేసి ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం లేకుండా కృషి చేసిందన్నారు.తాజాగా కురుస్తున్న భారీవర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది పూర్తి సమన్వయం, అంకిత భావంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గత వరదలను దృష్టిలో ఉంచుకుని వెలగలేరు హెడ్ రెగ్యులేటర్, బుడమేరు డైవర్షన్ ఛానల్ పై నిరంతరం నిఘా ఉంచామన్నారు. బుడమేరు నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా చర్యలు చేపట్టామన్నారు. బీడీసీ ద్వారా వరదనీరు కృష్ణానదికి వెళ్తోందన్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల ప్రకారం ప్రతి గ్రామం, మండలం, పట్టణంలో ప్రత్యేక ప్రతిస్పందన బృందాలను (రెస్పాన్స్ టీమ్స్) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వారంతా క్షేత్రస్థాయిలో పర్యటించి, తుపాను ముప్పు ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారన్నారు. మైకులలో అనౌన్స్ మెంట్ ద్వారా ప్రజలకు తుపాను ప్రమాద తీవ్రతను తెలియజేసినట్లు పేర్కొన్నారు. వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంగా ఉన్న వారిని వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించినట్లు పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా పునరావాస కేంద్రాల్లో 24 గంటలూ సిబ్బందిని ఉంచి, తగిన మందులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో వీరికి నాణ్యమైన ఆహారం, తాగునీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.వాగులు, వంకలు పొంగినప్పుడు ప్రమాదాలు సంభవించకుండా ముందస్తుగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చెరువులు, కాల్వగట్లు గండ్లు పడితే వెంటనే మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రహదారులు కోతకు గురైనా, చెట్లు విరిగిపడినా వెంటనే సరిదిద్దేందుకు అవసరమైన ట్రాక్టర్లు, జేసీబీలు, యంత్రాలను ముందే సమకూర్చుకుని సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు. భారీ, అతి భారీ వర్షాలకు పంట నష్టం లేకుండా, పశుసంపద నష్టం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పైర్లు ముంపునకు గురికాకుండా కాల్వలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీరాజ్, రహదారులు–భవనాలు, విద్యుత్తు శాఖలు నిరంతరం పరిస్థితుల్ని గమనిస్తూ తగు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు కూడా అందుబాటులో ఉండి ప్రజలకు నిత్యం సేవలను అందించారని, తుఫాను ముప్పు సమసిపోయే వరకూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

# బాధితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కుమార్ రాజా హామీ



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బొడ్డపాడు, తోట్లవల్లూరు గ్రామాలలో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస సహాయ కేంద్రాలను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి అక్కడ ఏర్పాటుచేసిన వసతి సౌకర్యం గురించి, అలాగే అందిస్తున్న అల్పాహారం, భోజనం, పిల్లలకు పాలు, పండ్లు వంటి అవసరాలు సక్రమంగా తీరుతున్నాయా అంటూ ప్రశ్నించారు. తుఫాన్ సమయంలో ప్రభుత్వం తరపున తగు ఏర్పాట్లు చేసి ఇబ్బందులు పడుతున్న వారికి సౌకర్యం కల్పించిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే పునరావాస కేంద్రాలలో ఉన్న బాధితులతో ఆయన మమేకమై వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందిస్తానని హామీ ఇచ్చారు. పూర్తిస్థాయిలో తుఫాను ప్రమాదం తగ్గిన అనంతరం అధికారులు తమ తమ గృహాలకు పంపిస్తారని అప్పటివరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ పునరావాస కేంద్రాలలో కొనసాగాలని ఆయన వారికి సూచించారు. బాధితులు ఇళ్లకు వెళ్లిన అనంతరం మరోసారి తాను ఆ ప్రాంతాలను పరిశీలించి వారికి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే భోజన సమయంలో బాధితులకు స్వయంగా వడ్డించి, అనంతరం వారితో కలిసి ఆయన కూడా అక్కడే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, బొడ్డపాడు గ్రామ సర్పంచ్ మూడే శివశంకరరావు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి యథావిధిగా పాఠశాలలు

### పాఠశాలలు తెరిచేందుకు ఫిట్‌నెస్ ధ్రువీకరణ తప్పనిసరి : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, మేజర్ న్యూస్ :** పునరావాస కేంద్రాలు ఉన్న పాఠశాలలు మినహా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు ఫిట్‌నెస్ ధ్రువీకరణ అనంతరం యథావిధిగా ఈ నెల 30వ తేదీ గురువారం నుంచి పనిచేస్తాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్ అండ్ బీ ఇంజనీర్లతో ఫిట్‌నెస్ ధ్రువీకరణ జరిగేలా ఎంఈవోలు, తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరగతి గదులు, పైకప్పులు, ప్రహరీ గోడలు, విద్యుత్ కనెక్షన్లు, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు అన్నీ సురక్షితంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే సిబ్బందిని, విద్యార్థులను పాఠశాల భవనాల్లోకి అనుమతించడం జరుగుతుందన్నారు. పునరావాస కేంద్రాలు ఉన్న పాఠశాలలు మాత్రం అధికారుల ఆదేశాల మేరకు పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేంత వరకు సెలవులు కొనసాగించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# అన్నదాతలు ఎవరూ అధైర్యపడవద్దు



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** అన్నదాతలు ఎవరూ అధైర్య పడవద్దని, అందర్నీ ప్రభుత్వం తరపున ఆదుకుంటామని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా రైతులకు హామీ ఇచ్చారు. మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన తోటవల్లూరులో పడిపోయిన వరి పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి మరో పది రోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో తుఫాను రావడం దురదృష్టకరమన్నారు. రైతులు వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంట చేతికొచ్చే సమయంలో ఈ విధంగా నష్టపోవడం బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా తుఫాన్ ను ఎదుర్కొందని, అలాగే నష్టపోయిన రైతుల విషయంలో కూడా సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే ద్వారా జిల్లాల్లో పర్యటిస్తున్నారని, ఈ పర్యటన పూర్తయిన అనంతరం ఆయన రైతులకు సంబంధించి ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేస్తారని, కావున రైతులు ఎవరూ అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. సాగు చేస్తున్న దానిలో సగానికి పైగా రైతులు నష్టపోవడం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. తొలుత ఆయన రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, పలువురు రైతులు, స్థానిక పార్టీ నాయకులతో కలిసి పడిపోయిన పంట పొలాలను పరిశీలించారు.

# నేలవాలిన భారీ వృక్షాలు విరిగిపడిన విద్యుత్ స్తంభాలు





**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను చల్లపల్లి మండలంలో బీభత్సం సృష్టించింది. మ ంగళవారం సాయంత్రం నుంచీ బుధవారం తెల్లవారుజాము వరకూ తీరప్రాంతాన్ని తలపించేలా ఈదురుగాలులు వీయటంతో భారీ వృక్షాలు నేలకొరిగాయి. బందరు రోడ్డు, నడకుదురు రోడ్డు, బైపాస్ రోడ్డు, పాగోలు రోడ్డుతోపాటు వక్కలగడ్డ తదితర గ్రామాల్లోనూ, ప్రధానంగా కరకట్టపై అడుగడుగునా చెట్లు విరిగిపడ్డాయి. ఈదురుగాలులకు రాత్రివేళ ఎవరూ బయటకు రానప్పటికీ ఉదయం వర్షం తగ్గుమ ఖం పట్టి, తెరపు ఇవ్వటంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంధ సంస్థలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. స్థానిక నిమ్మలతోటలో చెట్లు విరిగి విద్యుత్వేర్లపై పడ్డాయి. రామానగరంలో పలు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చల్లపల్లి మండలం మంగళాపురంలో గాలుల ధాటికి రేకులషెడ్డు ఇల్లు ధ్వంసమైంది. పూరింటిలో నివసించే ప్రజలు గాలులకు ఇబ్బందులు పడ్డారు. గాలులకు విద్యుత్ పరఫరా పూర్తిగా నిలిచిపోవటంతో గాఢాంధకారంలో రాత్రివేళ ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

## కస్టమర్లతో దురుసుగా ప్రవర్తిస్తున్న యూనియన్ బ్యాంక్ క్యాషియర్




**జగ్గయ్యపేట అక్టోబర్ 29 మేజర్ న్యూస్ :** పట్టణంలో ఉన్న యూనియన్ బ్యాంకులో క్యాషియర్ దురుసుతనం కస్టమర్ల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం పలువురిని ఆవేదనకు గరిచేస్తుంది. వివరాల్లోకి వెళితే షేర్ మహమ్మద్ పేట కు చెందిన కే శివ అనే వ్యక్తి బుధవారం డ్వాక్రాల్లోనూ కట్టుటకు బ్యాంకుకు వచ్చిన కస్టమర్ పై యూనియన్ బ్యాంకు క్యాషియర్ లక్ష్మణ్ అను బ్యాంకు ఉద్యోగి అసభ్యంగా దురుసుగా ప్రవర్తించడంతో మనోవేదనకు గురి అయి తన పై అధికారులు అయిన బ్యాంకు మేనేజర్ సూపర్వైజర్ కు సమాచారం ఇవ్వటంతో సమస్య సద్దుమణిగింది అని ఆయన తెలిపారు. బ్యాంకు దగ్గర నిబంధనలకు విరుద్ధంగా బీసీ పాయింట్ ఏర్పాటు చేయడంపై చర్యలు తీసు కోవాలని ఆయన కోరారు. ఈ అనంతరం ఆయన మాట్లాడుతూ డ్వాక్రా లోను కట్టడానికి యూనియన్ బ్యాంక్ కి వెళ్లిన నేను డ్వాక్రా లోన్ కట్టించు కోమని క్యాషియర్ కౌంటర్ కు వెళ్లి అడగగా బయట బీసీ పాయింట్ ఉంది నేను కట్టించుకోను అని చెప్పిగా బయటికి వెళ్లి చూడగా అక్కడ బీసీ పాయింట్ లేదు అని తిరిగివచ్చి చెప్పగా రేపు వచ్చి కట్టుకోమని అన్నాడని తెలిపాడు.బయట బిసి పాయింట్ లేదు దయచేసి కట్టించుకోండి అని కోరిన వినకుండా బీసీ పాయింట్ లేకపోతే రేపు వచ్చి కట్టు నేను మాత్రం కట్టించు కోను అని దురుసుగా క్యాషియర్ లక్ష్మణ్ ప్రవర్తించినట్లు తెలిపారు. దీనితో చేసేది ఏమీ లేక మేనేజర్ కి కంప్లైంట్ చేయడంతో మేనేజర్ డబ్బులు కట్టించుకోమని క్యాషియర్ కి చెప్పిన పట్టించుకోకుండా మేనేజర్ కట్టించుకోమని చెప్పినా సరే ఎవరు చెప్పినా నేను కట్టించుకోను అని చెప్పిన క్యాషియర్ లక్ష్మణ్ చివరికి మేనేజర్ ఒత్తిడితో అతి కష్టం మీద లోను కట్టించుకున్న క్యాషియర్..తన పై అధికారి మాట కూడా లెక్కచేయకుండా ఇటు కస్టమర్ల దగ్గర దురుసుగా వ్యవహరిస్తున్న క్యాషియర్ లక్ష్మణ్ పై చర్యలు తీసుకోవాలని ముక్తకంఠంతో బ్యాంకు కస్టమర్లు కోరుతున్నారు.

## జస్టిస్ గవాయ్ పై దాడిని ముక్తకంఠంతో ఖండించండి

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరు మండలం పెనపాక గ్రామంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్ పై జరిగిన దాడిని ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాలని ఎమ్మార్పీఎస్ నేత మండల శేఖర్ మాదిగ కోరారు.ఈ దాడిని నిరసిస్తూ నవంబర్ 1న హైదరాబాద్ లో నిర్వహించబోయే దళిత ఆత్మగౌరవ,నిరసన ర్యాలీ విజయవంతం చేయాలని కోరారు.జి.కొండూరు మండలంలోని పినపాకలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్పై జరిగిన దాడి భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టు వంటిదన్నారు. న్యాయాన్ని రక్షించే న్యాయమూర్తిపై దాడి జరిగటం మన దేశ న్యాయవ్యవస్థకు సవాలు వంటిదన్నారు.దీన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందా కృష్ణమాదిగ ఉద్యమ కార్యాచరణ చేపట్టారన్నారు.నవంబర్ 1న హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించనున్న భారీ నిరసన ర్యాలీనీ ఎమ్మార్పీఎస్ నాయకత్వం, ప్రజాస్వామ్య వాదులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సమిష్టిగా సహాయక చర్యలు

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** తుఫాను ప్రభావంతో వీచిన బలమైన ఈదురుగా లులకు గ్రామాల్లో చెట్లు విరిగి నేలపై పడ్డాయి. చల్లపల్లి- బందరు రోడ్డు, చల్లపల్లి నడకుదురు రోడ్డు, బైపాస్ రోడ్డు, కరకట్టపైనా ప్రధానంగా పెద్దఎ త్తున చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోవటంతో ప్రజల రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గత రాత్రి సైతం పోలీసులు స్వచ్ఛంధ సంస్థ ల భాగస్వామ్యంతో సహాయక చర్యలు చేపట్టగా, బుధవారం ఉదయం నుం చీ పెద్దఎత్తున స్వచ్ఛంధ శ్రమదానం చేసి రోడ్డుపై పడిన చెట్లను తొలగిం చారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు, రెడ్ క్రాస్ వాలంటీర్లు, పంచాయతీ, విద్యుత్ సిబ్బంది, స్థానికులు సహకారం అందించటంతో చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ పివిస్వి.సుబ్రహ్మణ్యం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా ఛైర్మన్ డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, సర్పంచ్ పైడిపాముల కృ ష్ణకుమారి, అధికారులు స్వయంగా సహాయక చర్యలు చేపట్టారు. యంత్రాల సహాయంతో చెట్లను కోయటంతోపాటు కత్తులతో కొమ్మలు నరికి రోడ్డుపై అడ్డుగా పడిన చెట్లను తొలగించేందుకు గంటల సమయం కష్టించారు. మంగళాపురంలో సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు సహాయక చర్యలు పర్యవేక్షించారు. సమిష్టి కృషితో చేపట్టిన సేవలు స్ఫూర్తిని నింపాయి.

## శివరామకృష్ణ, కృష్ణమోహన్‌ల జీవితం నేటితనానికి ఆదర్శనీయం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** హనుమానుల శివరామకృష్ణ, మల్లుపెద్ది కృష్ణమోహన్ ల జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీలు పేర్కొన్నారు. దివి తాలూకా కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ హనుమానుల శివరామకృష్ణ, మల్లుపెద్ది కృష్ణమోహన్ ల 27వ వర్ధంతి చల్లపల్లి మండల పరిధిలోని వక్కలగడ్డలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాయకులు మాట్లాడుతూ తాము నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి కడవరకు పార్టీకి సేవలు అందించిన శివరామకృష్ణ కృష్ణమోహన్ల జీవితం నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పరితపించేవారని, వక్కలగడ్డ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి వారు చేసిన కృషి అనిర్వచనీయమైనదన్నారు. వక్కలగడ్డ గ్రామ అభివృద్ధికి, మౌలిక సదుపాయాలు కల్పించుటలో కామ్రేడ్ మల్లుపెద్ది రామసుబ్బయ్య, హనుమానుల వెంకటేశ్వరరావు, రవణవరపు వెంకటేశ్వరరావు లతో కలిసి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. నేటి తరం కమ్యూనిస్టు నాయకులు వారి స్ఫూర్తిని కొనసాగించే విధంగా బాటలు వేశారనిపేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పేద ప్రజల అభివృద్ధికై నిరంతర పోరాటం కొనసాగించారని పేర్కొన్నారు. వారి ఆశయ సాధన కోసం కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆర్థికంగా బలపడిన నాడే కుటుంబాలు బాగుపడతాయని నమ్మిన శివరామకృష్ణ, కృష్ణమోహన్లు మహిళా సాధికారత కోసం అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. సిపిఐ అవనిగడ్డ నియోజకవర్గ నాయకులు కొల్లూరు శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్కలగడ్డ తొలితరం కమ్యూనిస్టు నాయకులు గూడూరు బాలకోటయ్య కుమార్తె గూడూరు భాగ్యలక్ష్మి, శివరామకృష్ణ కృష్ణమోహన్లతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మల్లుపెద్ది బోసు, పాలడుగు రత్న బాబు, మల్లుపెద్ది జగన్ మోహన్ రావు, అల్లూరి బాబురావు, అట్లూరి వెంకటేశ్వరరావు, మల్లుపెద్ది రాజా, హనుమానుల రాణి కుమారి తదితరులు పాల్గొన్నారు. తొలుత పార్టీ నాయకులు హనుమానుల శివరామకృష్ణ, మల్లుపెద్ది కృష్ణమోహన్ల చిత్రపటానికి పూలమాలవేసి విప్లవ జోహార్లు అర్పించారు.

## వెంకటాపురంలో ఎర్రచెరువు గండి పరిశీలించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను నేపథ్యంలో భారీగా వరదనీరు చేరి జి.కొండూరు మండలం వెంకటాపురం గ్రామంలోని ఎర్రచెరువుకు పడిన గండిని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బుధవారం పరిశీలించారు. గతంలో పడిన గండికి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టగా, మళ్ళీ తాజాగా ఎర్రచెర్వు నుంచి వరద నీరు లీకై గండి ఏర్పడి ప్రవహిస్తూ దిగువన ఉన్న వెల్లటూరు చెరువుకు చేరుతుందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదుకు రైతులు తెలిపారు. దీన్ని పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ దీనికి పడిన గండిని శాశ్వత ప్రాతిపదికన పూడ్చివేసి మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నేతను పరామర్శించిన ఎమ్మెల్యే



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ, మైలవరం ఏ.ఎం.సి మాజీ చైర్మన్ వుయ్యూరు వెంకట నరసింహారావును మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బుధవారం పరామర్శించారు. ఆయన కంటికి సంబంధించిన శస్త్రచికిత్సను ఇటీవల చేయించుకుని, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. బుధవారం జి.కొండూరులో వారి నివాసానికి విచ్చేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆయన ఆరోగ్యం గురించి స్వయంగా తెలుసుకున్నారు. తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాల్లో 900 మందికి ఆశ్రయం

**చల్లపల్లి, మేజర్ న్యూస్:** మొంథా తుఫాను సహాయక చర్యల్లో భాగంగా చల్లపల్లి మండలంలో 11 పునరావాస కేంద్రాల్లో 309 కుటుంబాలకు ఆశ్రయం కల్పించారు. చల్లపల్లి జడ్పీహైస్కూల్లో, లక్ష్మీపురంలో ప్రధానంగా 300 మందికి పైగా కుటుంబ సభ్యులు ఉండగా, మండలం మొత్తంగా 900 మ ంది కేంద్రాల్లో తలదాచుకున్నారు. రోడ్డువెంబడి గుడారాల్లో నివసించే ఎస్టీలు, చిత్తుకాగితాలు ఏరుకుని జీవించే ప్రజలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను ప్రధానంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. మంగళవారం తుఫాను బీభత్సం సృష్టించిన నేపథ్యంలో కుటుంబ సభ్యులతో కలిసి పేదలు కేంద్రాల్లో సేదతీరారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు అంధకారంలో ఉన్నప్పటికీ పునరావాస కేంద్రాల్లో జనరేటర్లు పనిచేశాయి. అధికారులు ముందస్తు చర్యలతో కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా తలదాచుకున్నారు. తుఫాను బాధితులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రివేళ భోజనాలు అందించారు. తుఫాను తీరందాటటం, వర్షాలు లేకపోవటంతో బుధవారం మధ్యాహ్నం భోజనాలు చేసిన అనంతరం కేంద్రాల నుంచీ ప్రజలు తమ నివాస ప్రాంతాలకు వెళ్లిపోయారు. మండల ప్రత్యేకాధికారి ఆర్ సి.ఆనందకుమార్, చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షిలతోపాటు ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, కూటమి నేతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పలువురు నాయకులు పునరావాస కేం ద్రాల నిర్వహణకు తమవంతు సహకారం అందించారు

## మైలవరం ప్రముఖులు గోగులమూడి మృతి

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం ప్రముఖులు, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ గోగులమూడి సత్యనారాయణరెడ్డి ఈ నెల 26న ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం మైలవరం పట్టణంలోని వారి నివాసానికి విచ్చేశారు. దివంగత గోగులమూడి సత్యనారాయణ రెడ్డి పార్థీవదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గుడ్లవల్లేరులో పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు భేష్

**గుడ్లవల్లేరు అక్టోబరు 29 మేజర్ న్యూస్:** మొంథా తుపానుకు గుడ్లవల్లేరు మండలంలోని అంగలూరు, డోకిపర్రు, కౌతవరం, గుడ్లవల్లేరు తుపాను పునరావాస కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి జి.రమేష్, తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ ఇమ్రాన్ పరిశీలించారు. తుపాను బాధితులకు భోజన ఏర్పాట్లను చేపట్టారు. కౌతరంలో సాగునీటి డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, ఎస్.ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ, అంగలూరులో సర్పంచి మేడేపల్లి రవికుమార్, ఉప సర్పంచి త్రిపురనేని సురేష్, గుడ్లవల్లేరు కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావు, విఆర్వోలు ఎస్ ప్రకాష్, యువరాజ్, విఆర్ఏ ఆదర్శ్, గుడ్లవల్లేరు ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎమ్ రమాదేవి, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ప్రజల క్షేమమే ప్రథమ ధ్యేయం

**తుఫాను భద్రత చర్యలుగా 41 పునరావాస కేంద్రాలు**

**వర్షాలు కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలందరికీ కార్పొరేషన్ అండగా ఉంటుంది**

**మేయర్ రాయన భాగ్యలక్ష్మి**



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** కొండ ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారి కోసం విజయవాడ నగర వ్యాప్తంగా మూడు నియోజకవర్గాల్లో మొత్తం 41 పునరావాస కేంద్రాలన ఏర్పాటు చేశామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం లెక్కల ప్రకారం, మూడు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 349 మంది ప్రజలు పునరావాస కేంద్రాలలో బస చేస్తున్నారని, బుధవారం ఉదయం మేయర్ మీడియాతో అన్నారు. వర్షాలు కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలందరికీ కార్పొరేషన్ అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. మొంథా తుఫాన్ కారణంగా విజయవాడ నగరంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో, వారి కోసం నగరపాలక సంస్థ తరఫున విస్తృత స్థాయిలో పునరావాస చర్యలు చేపట్టామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి వెల్లడించారు. కొండ ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారి కోసం విజయవాడ నగర వ్యాప్తంగా మూడు నియోజకవర్గాల్లో మొత్తం 41 పునరావాస కేంద్రాలన ఏర్పాటు చేశామని మేయర్ తెలిపారు. సర్కిల్-1 పరిధిలో 15, సర్కిల్-2 పరిధిలో 16, సర్కిల్-3 పరిధిలో 10 కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఈ కేంద్రాలలో ప్రజలకు పూర్తిస్థాయిలో మరుగుదొడ్లుతో పాటు, వైద్య సేవలు కూడా అందుబాటులో ఉంచామని, డీఎంహెచ్‌వో ద్వారా వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య సహాయం అందిస్తున్నామని వివరించారు. ప్రతిరోజు ఎంతో మంది నిరాశ్రయులైన ప్రజలు ఈ కేంద్రాలకు వచ్చి, కార్పొరేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ఆహారాన్ని తీసుకుంటున్నారని, కొంతమంది భోజనం చేసి వారి బంధువుల ఇళ్లకు వెళ్తుంటే, మరికొంత మంది ఆ సెంటర్లలోనే ఉంటున్నారని మేయర్ తెలిపారు. బుధవారం బుధవారం లెక్కల ప్రకారం, మూడు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 349 మంది ప్రజలు పునరావాస కేంద్రాలలో బస చేస్తున్నారని మేయర్ పేర్కొన్నారు. సర్కిల్-1లో 178 మంది, సర్కిల్-2లో 115 మంది, సర్కిల్-3లో 53 మంది ఉంటున్నట్లు లెక్కలు తెలియజేశారు. ఇబ్బందులు పడుతున్న ప్రజలందరికీ కార్పొరేషన్ అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.

# తుఫాన్ కారణంగా నేలకొరిగిన అరటి తోటలు, వరి పేర్లు...

## ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి





**పామర్రు మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా వీచిన గాలులకు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లోనూ గాలుల కారణంగా వరి పైరు నేల కొరిగింది. అంతే కాక పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాల పరిధిలోని లంక గ్రామాలలో సాగు చేస్తున్న అరటి తోటలు సైతం నేలకు ఒరగడంతో ఆ రైతులు తీవ్రంగా నష్టపోయారు. తోట్లవల్లూరు మండల పరిధిలోని తోడేళ్ల దిబ్బలంక గ్రామంలో అరటి గెలలు పక్వానికి వచ్చే దశలో తోట కూలిపోవడంతో రైతులు లక్షల రూపాయలు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పామర్రు మండలంలో 21 వేలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేయగా దాదాపు 15 వేల ఎకరాల వరి నేలకొరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. అలాగే పమిడిముక్కల మండలంలో 20,500 ఎకరాల్లో వరిసాగు కాగా సుమారు 18వేల ఎకరాలు, తోట్లవల్లూరు మండలంలో 21 వేల ఎకరాలు వరి సాగులో ఉండగా 11వేల ఎకరాలు, పెదపారుపూడి మండలంలో 18,400 ఎకరాలలో సుమారు 2000 ఎకరాలు వరకు నష్టం జరిగినట్లు ఆయా మండలాల వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. అయితే సర్వే నిర్వహించిన అనంతరం పూర్తిస్థాయిలో విచారించి నష్టం వివరాలను వెల్లడించగలమని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, లేకుంటే తాము తీవ్రంగా నష్టపోయి అప్పుల ఊబిలో పడే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## తుపానుకు వరి రైతుకు అపార నష్టం

**2,255ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లుగా ప్రభుత్వానికి నివేదిక**



**గుడ్లవల్లేరు అక్టోబరు 29 మేజర్ న్యూస్:** బలమైన ఈదురుగాలులతో వచ్చిన మొంథా తుపానుకు గుడ్లవల్లేరు మండలంలో వరి రైతులు అపార నష్టానికి గురయ్యారు. పొలాలు పడిపోయి వర్షపు నీటిలో మునిగి పోవటంతో వరిపైరు కుళ్లిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తుపాను రైతన్న నడ్డి విరచి అప్పుల ఊబిలోకి తోచేసిందని అంటున్నారు. వర్షానికి నీట మునిగిన పొలాల్లోని వరి పైరు పొట్ట మీద ఉండటంతో ఇక పంట చేతికి అందదనే ఆందోళనలో రైతులు ఉన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని రైతులు ఆరోపిస్తున్నారు. తమకు ఎకరానికి రూ. 20వేల నష్ట పరిహారం ప్రభుత్వం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఓ ఎల్.సునీల్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు తమ ప్రాథమిక పరిశీలనలో మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా తుపానుకు పంట మునిగినట్లు బుధవారం తెలిపారు. ఇప్పటి వరకు మండలంలోని 2,255ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లుగా ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించినట్లు పేర్కొన్నారు.

## తుఫాను గాలులకు నేలవాలిన వరిచేలు

**విరిగిపడిన అరటిచెట్లు**



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** తుఫాను గాలుల ధాటికి వరిచేలు నేలవాలాయి. చల్లపల్లి మండలంలో 11వేల 907 ఎకరాల్లో వరిసాగు జరుగుతుండగా, పలు గ్రామాల్లో వరిచేలు గింజ పాలుపోసుకునే దశలో ఉండగా, పలు గ్రామాల్లో వరిపైరు గింజ తయారై ఉంది. గాలుల తీవ్రతకు వరి గింజలు తయారైన చేలు నేలవాలాయి. మాజేరు పరిధిలోని పల్లపు ప్రాంతంలో సుమారు 190 ఎకరాలు నీటిలో ఉన్నాయి. చల్లపల్లి, మంగళాపురం, మాజేరు, మేకావారిపాలెం, వక్కలగడ్డ, రాముడుపాలెం, పాగోలు తదితర గ్రామాల్లో 3618 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈమేరకు గ్రామాల్లో పర్యటించి వరిచేలను పరిశీలించి రైతులకు సూచనలు అందిస్తున్నట్లు ఏవో కె. మురళీకృష్ణ తెలిపారు. కృష్ణానదీతీర గ్రామాల్లో వాణిజ్య పంటలు, ప్రధానంగా అరటితోటలు గాలులకు విరిగి పడ్డాయి. చేతికందే దశలో ఉన్న అరటిచెట్లు విరిగిపడిపోవటం తో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. చల్లపల్లి మండలంలో వరద కారణంగా గతంలో అరటి రైతులు నష్ట పోగా, తాజాగా 114 ఎకరాల్లో అరటి తోటలు, రెండెకరాల్లో బొప్పాయి పంటకు నష్టం వాటిల్లినట్లు అం చనావేసినట్లు ఉద్యానవన శాఖ అధికారాణి జె. కీర్తి తెలిపారు.



## రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డా. హసీమ్ బేగ్ బాధ్యతలు



- 156వ బోర్డు సమావేశం ఏర్పాటు
- ఎన్నికల హామీల ప్రకారం ఎజెండాలకు ఆమోదం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** గత నెల సెప్టెంబరు 3తేదీన ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ విడుదల చేసిన గవర్నమెంట్ జీవోలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలసౌరి ఆశీస్సులతో బుధవారం హట్టహాసంగా రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డా. హసీమ్ బేగ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డా. హసీమ్ బేగ్ మాట్లాడుతూ తనపై నమ్మకం తనకు అప్పగించిన బాధ్యతలన్నిటిని నెరవేరుస్తాన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అర్హులందరికి లబ్ది చేకూరేలా చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఏవైతే హామీలిచ్చారో వాటిని నెరవేర్చేందుకు శాయిశక్తుల కృషి చేస్తానన్నారు. అందరిని కలుపుకుంటూ పనిచేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలసౌరి కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ సాహెబ్ వీసీ, ఎండీ యాకూబ్ బాషా, డిప్యూటీ సెక్రటరీ ఏపీ సచివాలయం సుధాకర్, స్టేట్ మైనారిటీ అధికారులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం 156వ బోర్డు సమావేశం నిర్వహించడం జరిగింది. ఏదైతే నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలలో హామీ ఇచ్చారు ఆ ఎజెండాలపై చర్చించి ఆమోదం తెలపడం జరిగింది.

## పునరావాస శిబిరంలోని బాధితులకు దుప్పట్లు, బిస్కెట్లు పంపిణీ



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని బొడ్డపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన తుఫాన్ పునరావాస శిబిరాన్ని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి సందర్శించారు. పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదేశాల మేరకు సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ శిబిరంలో ఉన్నవారికి బిస్కెట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డపాడు గ్రామ సర్పంచ్ మూడే శివశంకరరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు శనివారపు కృష్ణ సుమన్, పార్టీ నాయకులు గోపాలకృష్ణ తదితరులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుమూర్తి బాధితులను పరామర్శించి వారికి అందిస్తున్న వసతి, భోజన సదుపాయాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని బాధితులకు అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.


## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో

ఫోన్ : 9642 980 999